వన్‌టౌన్ రోడ్డు విస్తరణకు మార్గం సుగమం



విస్తరించనున్న వన్‌టౌన్ రహదారి

- వంద అడుగుల విస్తరణకు సహకరించని భవన యజమానులు
- 60 అడుగులకు సానుకూలం
- మాస్టర్ ప్లాన్ సిద్ధం
- పూర్తయిన మార్కింగ్

జగదాంబ: వన్‌టౌన్ రోడ్డు విస్తరణకు ఎట్టకేలకు మార్గం సుగమం అయింది. కొద్ది సంవత్సరాలుగా ఉన్న విస్తరణ సమస్య 60 అడుగులకు కటాఫ్ అవడంతో భవన యజమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

100 అడుగుల వద్ద మొదలై..

మొదట ఈ రహదారిని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జగదాంబ నుంచి వన్ టౌన్‌లోని క్వీన్ విక్టోరియా విగ్రహం వరకు వంద అడుగులకు విస్తరించేందుకు జీవీఎంసీ ప్రతిపాదనలు తయారు చేసింది. అయితే ఈ విస్తరణలో భవనాలు కోల్పోతున్న భవన యజమానులు సహకరించకపోవడంతో తరువాత 80 అడుగుల వరకు ప్రతిపాదనలు తయారు చేశారు. అప్పటికీ కొందరు యాజమానులు కోర్టులను ఆశ్రయించారు. చివరికి వైఎస్సార్ సీపీ హయాంలో జీవీఎంసీ భవన యాజమానుల సౌకర్యార్థం అరవై అడుగులకు చెప్పడంతో జీవీఎంసీకి, యాజమానులకు మధ్య సమస్య సదుమణిగింది. దీంతో రహదారి విస్తరణకు సంబంధించి మాస్టర్ ప్లాన్‌ను కూడా జీవీఎంసీ తయారు చేయడంతో జోన్-4 టౌన్‌ప్లానింగ్ అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు.

టీడీఆర్‌లు సిద్ధం

వన్‌టౌన్ రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన భవన యాజమానులకు జీవీఎంసీ టీడీఆర్‌లు సిద్ధం చేసింది. మొత్తం ఈ విస్తరణలో 204 దుకాణాల వరకు దెబ్బ తింటున్నాయి. ముఖ్యంగా పూర్ణామార్కెట్ నుంచి ఈ విస్తరణ జరుగుతోంది. ఇప్పటికే కొందరు భవన యాజమానులు వారి డాక్యుమెంట్స్ జీవీఎంసీకి ఇచ్చి టీడీఆర్‌లు పొందారు. మిగిలిన వారందరూ జీవీఎంసీ జోన్-4లో దరఖాస్తు చేసుకుంటే వెంటనే వారికి టీడీఆర్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

త్వరలోనే విస్తరణ పనులు



వన్‌టౌన్ రోడ్డు విస్తరణ మార్కింగ్ పూర్తయింది. ఎన్నికల కోడ్ తర్వాత పనులు మొదలుపెడతాం. ఇప్పటి వరకు టీడీఆర్‌లు తీసుకోని వారంతా జీవీఎంసీ కమిషనర్ పేరుతో దరఖాస్తు చేసుకుంటే, వెంటనే వారికి టీడీఆర్‌లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం.
– వినయ్‌ప్రసాద్, ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ టౌన్‌ప్లానింగ్, జోన్-4

క్లుప్తంగా

గ్రూపు-2పై 9న అవగాహన సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శిక్షణ కేంద్రం ప్రతినిధులు

మద్దిలపాలెం: ఏపీపీఎస్సీ గ్రూప్-2 అభ్యర్థులకు ఈ నెల 9న ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నామని అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ అభిమన్యు, డీవైఎఫ్ఐ అధ్యక్షుడు యు.ఎస్.ఎన్.రాజు తెలిపారు. ఈ మేరకు సదస్సు పోస్టర్‌ను సోమవారం మద్దిలపాలెంలో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గ్రూప్-2 పరీక్ష విధానంపై మధ్యాహ్నం 2.30 గంటలకు సదస్సు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ కార్యదర్శి కె.సంతోష్, ఐ.రఘు పాల్గొన్నారు.

పథకాల అమలులో సమన్వయం అవసరం



శిక్షణకు హాజరైన అధికారులతో ఐఐఎం సంచాలకుడు ఆచార్య చంద్రశేఖర్

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయం ఎంతో అవసరమని కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పూర్వ కార్యదర్శి అజయ్ ప్రకాష్ షానోయ్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నంలో డిజిటల్ గవర్నెన్స్–మేనేజ్‌మెంట్ అంశంపై ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులకు ఐదు రోజుల స్వల్పకాలిక శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణను కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పూర్వ కార్యదర్శి అజయ్ ప్రకాష్ షానోయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాధారణ పౌరుడికి విభిన్న సేవలను సాంకేతిక విధానాలు ఏ విధంగా చేరువ చేస్తున్నాయో వివరించారు. ప్రపంచానికి అవసరమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించే సామర్థ్యం భారత్‌కు ఉందని స్పష్టమైందన్నారు. పారదర్శకతను పెంపొందించడానికి డిజిటల్ మౌలిక వసతులు ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని తెలియజేశారు. ఐఐఎం విశాఖపట్నం సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల నిపుణులు ఐఐఎంవీ అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఆచార్య నీన పాండే, ఆచార్య శ్రీనివాస్ జోస్యుల తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

ఆరిలోవ: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. రూరల్ తహసీల్దారు కార్యాలయం సమీప ప్రభుత్వ బాలికల గృహాన్ని సోమవారం కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులతో కలసి ఆయన సందర్శించారు. గృహంలో బాలికలకు కల్పిస్తున్న సౌకర్యాలతో పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ బాలికలతో అప్పారావు మాట్లాడారు. పదో తరగతి చదువుతున్న బాలికల పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని గృహం సూపరింటెండెంట్ సునీతకు సూచించారు. వారికి క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థులు చెడు స్నేహాలు చేయకూడదన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ ఎం.ఆర్.ఎల్.రాధ, సభ్యుడు సూర్యనారాయణ, గృహం సిబ్బంది పాల్గొన్నారు.

జోన్-4లో 75 శాతం ఆస్తి పన్ను వసూలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: ఈ ఏడాది జీవీఎంసీ జోన్-4 పరిధిలో సుమారు 75 శాతం ఆస్తి పన్ను వసూలు చేశామని జెడ్సీ కె.శివప్రసాద్ తెలిపారు. సోమవారం జోనల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సెక్రటరీ అడ్మిన్‌లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జోన్-4 పరిధిలో రెవెన్యూ వసూలు లక్ష్యం రూ.53 కోట్లు కాగా.. ఇప్పటికి రూ.41 కోట్లు వసూలు చేశామన్నారు. ఇందుకోసం అంకిత భావంతో విధులు నిర్వహించిన రెవెన్యూ అధికారులు, సెక్రటరీలను ఆయన అభినందించారు. ఈ నెలాఖరుకు జోన్ పరిధిలో ఆస్తి, నీటి, ఇంటి, ఖాళీ స్థలాలలకు సంబంధించిన అన్ని పన్నుల వసూలు నూరు శాతం పూర్తి చేయాలన్నా రు. ఇప్పటి వరకు పన్నులు చెల్లించని వారిని గుర్తించి ఆఖరు నోటీసులు జారీ చేయాలన్నారు. అప్పటికి పన్నులు చెల్లించకపోతే జప్తు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. చెల్లింపుదారుల నుంచి డీడీల రూపంలో తీసుకోవాలన్నారు. చెక్కులు తీసుకోవద్దని జెడ్సీ సూచించారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణపై శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శోభారాణి

డాబాగార్డెన్స్: ఆత్మరక్షణకు దేహదారుఢ్యం కంటే మానసిక స్థైర్యం అవసరమని విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి అన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ ధైర్యం కోల్పోకూడదని సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో విద్యార్థినులకు ఆత్మరక్షణ..నైపుణ్యాలపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి , వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ కేవీఎస్ నాగలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ఏహెచ్‌డీ పుష్పలత, పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాల తో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వ హించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

ద్వారకా పోలీసుల ఔదార్యం



వృద్ధుడు జగన్నాథంను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న కానిస్టేబుల్ వెంకటేష్

సీతమ్మధార: మతిస్థిమితం లేని ఓ వృద్ధుడిని ద్వారకా జోన్ పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించి తమ ఔదార్యం చూపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం సీఐ సింహాద్రినాయుడు నేతృత్వంలో పెట్రోలింగ్ చేస్తుండగా.. నిస్సహాయ స్థితిలో ఉన్న ఒక వృద్ధుడిని గుర్తించారు. అతడిని ప్రశ్నించగా మతిస్థిమితం సరిగ్గా లేదని తెలుసుకున్న కానిస్టేబుల్ వెంకటేష్ కొన్ని ఆనవాళ్లు గుర్తించి సూర్యాబాగ్‌లో ఉండే కుటుంబ సభ్యులకు అప్పగించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లిన వృద్ధుడు ఎడ్ల జగన్నాథం కనిపించకపోవడంతో రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అతడి మనవరాలు కె.ఎస్.ప్రత్యూష ఫిర్యాదు చేశారు. నగర పోలీస్ కమిషనర్ వాట్సాప్ నంబర్‌కు ఒక సందేశం ఇవ్వడంతో పోలీసులు అప్రమత్తమై వృద్ధుడిని అతడి కొడుకు ఎడ్ల రవి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీఐ సింహాద్రినాయుడు, సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఈస్ట్‌కోస్ట్ రైల్వే యూనియన్ నాయకులకు కరపత్రం అందజేసి ఓటు అభ్యర్థిస్తున్న సనపల రవీంద్రభరత్



వార్డు పరిధిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న చెన్నా జానకీరామ్



కల్లుపాకల్లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి



ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల మద్దతు కోరుతూ కరపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ నారాయణరావు

డాబాగార్డెన్స్/జగదాంబ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం దక్షిణ నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు తలమునకలయ్యారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల రవీంద్రభరత్ సోమవారం ఈస్ట్ కోస్ట్ రైల్వే యూనియన్ నాయకులు, శ్రామిక్ యూనియన్ డివిజనల్ ఆఫీస్‌లో జోనల్ ప్రెసిడెంట్ ఆర్‌వీఎస్ఎస్ రావును, డివిజనల్ కో ఆర్డినేటర్ పీవీజే రాజు, డిప్యూటీ డివిజనల్ కో ఆర్డినేటర్ రామ్మోహనరావు, ఇతర కార్మిక నాయకులను వారి కార్యాలయాల్లో కలిసి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

➡ సుధాకర్ తరఫున 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ బైక్ ర్యాలీ చేపట్టారు. జబ్బర్‌తోట, రెల్లి వీధి తదితర ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆకుల యేసు, డేవిడ్‌రాజు, కాసారపు వాసు, దైవకుమార్, సత్యవతి, ఆనంద్, రమణ, వంశీ, శేఖర్, రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

➡ జీవీఎంసీ 29వ వార్డు పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు కలిసి సుధాకర్‌కు ఓటు వేయాలని కోరారు.

➡ జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సీతంరాజుకు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కంటిపిల్లి వరలక్ష్మి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

➡ వైఎస్సార్‌సీపీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో వెలంపేట, పాతపోస్టాఫీసు, లక్ష్మీనగర్ ప్రాంతల్లో ఎన్నికల ప్రచారం చేశారు. పట్టభద్రులంతా సీతంరాజుకు పట్టం కట్టాలన్నారు.

బైక్ ర్యాలీకి తరలిన నాయకులు

అల్లిపురం: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా సోమవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేపట్టిన బైక్ ర్యాలీకి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ ఆధ్వర్యంలో బంగారుమెట్ట నుంచి పార్టీ శ్రేణులతో బయలుదేరి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.రమేష్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీకి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో వి.వెంకటప్పారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో స్నేహభావం అవసరం

ఏయూ క్యాంపస్: విద్యార్థులు స్నేహభావంతో కలసికట్టుగా పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించగలరని ఏయూ తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యుడు జి.యోహాన్‌బాబు అన్నారు. సోమవారం ఉదయం ఏయూ తెలుగు విభాగంలో నిర్వహించిన విద్యార్థుల స్వాగత వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు భవిష్యత్తుకు బాటలు వేస్తాయన్నారు. తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేస్తే ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, సినిమా, పత్రికలు, పర్యాటక రంగాలలో అవకాశాలు ఎదురుచూస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు మార్కుల కోసం కాకుండా మనసు పెట్టి అవగాహనతో చదువుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరన్నారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా విభాగాన్ని తీర్చిదిద్దడం ఆనందంగా ఉందన్నారు. జూనియర్లను ఎంతో ఆప్యాయతతో రెండో సంవత్సరం విద్యార్థులు ఆహ్వానించడం చాలా బాగుందన్నారు. ఆహ్వాన వేడుకలలో భాగంగా జరిగిన ఆటల పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ అయ్యగారి సీతారత్నం, డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కట్టిపోగు రత్నశేఖర్, డాక్టర్ పెంట్యాల లావణ్య, ఆతుకూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడికి గాయాలు

మర్రిపాలెం: ఆటో ఢీకొని తల్లి, కుమారుడికి గాయాలైన ఘటన సోమవారం కంచరపాలెం పరిధిలో జరిగింది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కాన్వెంట్ జంక్షన్ నుంచి కంచరపాలెం మీదుగా ద్విచక్ర వాహనంపై జ్యోతీనగర్‌కు వస్తున్న భర్త, భార్య, కుమారుడి ని ముత్యాలమ్మ గుడి దగ్గర న్యూకాలనీ నుంచి కంచరపాలెం వైపు వెళ్తున్న ఏస్ ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాండ్ర మాధురి, ఆమె కుమారుడు ఐదేళ్ల నవ్‌నీత్‌సాయికి గాయాలయ్యాయి. బాబుకు ముక్కు, చెవి వెంబడి రక్తం కారడంతో అపస్మారక స్థితిలో ఉన్నాడు. ప్రస్తుతం చికిత్స అందిస్తున్నారు. మాధురి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మూల్యాంకన కేంద్రం పరిశీలిస్తున్న రెక్టార్ సమత

మూల్యాంకన కేంద్రం పరిశీలన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రశ్నాపత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సోమవారం ఉదయం సందర్శించారు. బీఈడీ మూడో సెమిస్టర్ ప్రశ్నపత్రాల మూల్యాంకనం జరుగుతున్న విధానాన్ని ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, అధికారులు పాల్గొన్నారు.

లయోలా ఆశ్రమంలో వృద్ధులకు ఆశ్రయం



వృద్ధురాలిని లయోలా వృద్ధాశ్రమంలో చేర్పిస్తున్న మమత



వృద్ధుడిని లయోలా వృద్ధాశ్రమంలో చేర్పించిన వాసు

అల్లిపురం: ఆదరణకు నోచుకోని, అనారోగ్యంతో ఉన్న ఇద్దరు వృద్ధులను స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పెందుర్తిలోని లయోలా ఆశ్రమంలో చేర్పించారు. వివరాలివి.. కంచరపాలెం బస్టాపులో 80 ఏళ్ల ఓ వృద్ధురాలు నాలుగు రోజులుగా తిండి కూడా తినకుండా పడుకుని ఉన్నారు. తన పేరు, వివరాలు ఏమీ చెప్పడం లేదు. దీంతో స్థానికులు మమత చారిటబుల్ ట్రస్ట్ సభ్యురాలు ఎల్లేటి మమతకు సమాచారం అందించారు. ఆమె అక్కడికి చేరుకుని వృద్ధురాలికి సపర్యలు చేశారు. అనంతరం కంచరపాలెం ఏఎస్ఐ ఆదిరాజు సహకారంతో పెందుర్తి లయోలా వృద్ధాశ్రమంలో చేర్పించారు.

➡ భీమ్‌నగర్, జీవీఎంసీ ఏయుటీడీ నైట్ షెల్టర్‌లో 2018 నుంచి ఆశ్రయం పొందుతున్న విజయకుమార్ (84) పక్షవాతంతో మంచం పట్టారు. ఈయనకు భార్య ఉంది. కుమారుడు, కుమార్తె ఇద్దరూ మరణించారు. పక్షవాతం కారణంగా కదలని పరిస్థితిలో ఉన్న ఆయన్ను సంస్థ ప్రతినిధి పి.వాసు పెందుర్తి లయోలా వృద్ధాశ్రమంలో సోమవారం చేర్పించారు.

ప్రజా వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం



అర్జీలను పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 02, పబ్లిక్ హెల్త్‌కు 01, రెవెన్యూ విభాగానికి 02 చొప్పున అందినట్లు ఆయన చెప్పారు. సత్వరమే వాటిని పరిష్కరించాలని జోనల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1, 2 టి.ఎస్.ఎస్.రాజు, ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వో బాబురావు, ఇంజినీరింగ్ ఈఈ టి.ప్రసన్నరెడ్డి, వాటర్ డీఈ భరణికుమార్, ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ జనార్దన్, ఏపీడీ పద్మావతి, అపరంజిత, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైల్వే పారిశుధ్య కార్మికులకు వితరణ



కార్మికురాలికి శానిటరీ నాప్‌కిన్లు అందిస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి విశాఖ రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులకు శానిటరీ నాప్‌కిన్లు అందజేశారు. వారోత్సవాల్లో భాగంగా ఈకార్వో ఆధ్వర్యంలో మహిళల హక్కులు, లింగసమానత్వం, పునరుత్పాదక హక్కులు, మహిళలపై జరుగుతున్న హింస వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నట్లు పారిజాత సత్పతి తెలిపారు. వీటితోపాటు ఉత్తమ మహిళా ఉద్యోగి, ఉత్తమ విద్యార్థుల(రైల్వే ఉద్యోగుల్లో)ను గుర్తించి వారికి ప్రశంసాపత్రాలు, స్కాలర్‌షిప్స్ వంటివి అందజేయడం, టాలెంట్ హంట్, పేదలకు సహాయం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఈకార్వో సెక్రటరీ ప్రియాంక శ్రీదేవి, ఇతర ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌డీవై, ఎస్‌బీసీ వెలమ సంఘం నూతన కార్యవర్గం

డాబాగార్డెన్స్: నేవల్ డాక్‌యార్డ్, ఎస్‌బీసీ ఉద్యోగుల వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన బేరర్ సభ్యులను ఉద్యోగులు ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌వీ రమణ, అధ్యక్షుడిగా ఆర్‌పీ నాయుడు, కార్యదర్శిగా వై.రామునాయుడు, కోశాధికారిగా ఎల్.దేముడుబాబు, ఉపాధ్యక్షులుగా ఆర్.శంకరరావు, ఆర్.వెంకట్రావు, సహాయ కార్యదర్శులుగా కె.శ్రీనివాసరావు, అల్లు కిరణ్‌కుమార్, సీహెచ్.జనార్దనరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జి.వెంకటరమణ, రెడ్డి శ్రీనివాస్, ఆర్.లోవరాజు, అసిస్టెంట్ సెక్రటరీలుగా పి.రామునాయుడు, బి.వరహాలుబాబు, సబ్బవరపు సతీష్, ఎం.రామారావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు, కార్పొరేటర్లు అల్లు శంకరరావు, బొడ్డు నరసింహపాత్రుడు, ముర్రు వాణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళా జర్నలిస్టులకు సత్కారం



మాట్లాడుతున్న గంట్ల శ్రీనుబాబు

అల్లిపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం మహిళా జర్నలిస్టులను సత్కరించనున్నామని ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9 గంటల నుంచి ప్రెస్‌క్లబ్‌లో వేడుకలు నిర్వహించనున్నామన్నారు. వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న మహిళా జర్నలిస్టులకు, ఇతర ప్రముఖులను సత్కరించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి దాడి రవికుమార్, ప్రొగ్రాం కో ఆర్డినేటర్, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మేధోశక్తిని మెరుగుపరుచుకోవడం తప్పనిసరి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: విద్యార్థులు తమ మేధోశక్తిని నిరంతరం మెరుగుపరుచుకోవడం తప్పనిసరని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఉదయం ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో ఉన్నత విద్యా మండలి నిర్వహించిన జోనల్ స్థాయి క్విజ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞాపక శక్తికి పరీక్షగా క్విజ్ పోటీలు నిలుస్తాయన్నారు. విశ్లేషణాత్మక ఆలోచనలకు ఈ పోటీలు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమ అధ్యక్షుడు ఆచార్య ఎ.నాగహనుమాన్ మాట్లాడుతూ 40 గ్రూపులుగా 80 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొంటున్నారన్నారు. విద్యార్థులకు వర్సిటీ ప్రాంగణంలో వసతి, భోజన సదుపాయాలు కల్పించామన్నారు. ఉన్నత విద్యా మండలి అధికారి ఎ.ఆర్.నగేష్ మాట్లాడుతూ మూడు రీజియన్‌లుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో విజేతలకు రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శ్రీధర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.